నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 31 మార్చి 2025 SANGAREDDY


# ఈద్ ముబారక్

- అల్లా దయతో తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు



సిద్దిపేట, మార్చి 30: ఈద్-ఉల్-ఫితర్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రమాసం దీక్షలు, ప్రేమ, దయ, సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు. లౌకికవాదం, మతసామరస్య పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభీక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగను అధికారికంగా ప్రకటించిన ఘనత గులాబీ అధినేత కేసీఆర్‌కే దక్కిందన్నారు. యేటా పేద ముస్లింలకు రంజాన్‌తోఫా ఇచ్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. నెల రోజులు ముస్లింలు చేసిన ఉపవాస దీక్ష ఫలించి అల్లా దయతో రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నారు.

# ప్రజలందరికీ శుభం కలగాలి



సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


- కేసీఆర్ మొట్టమొదట బ్రాహ్మణ పరిషత్‌ను సిద్దిపేటలో ఏర్పాటు చేశారు
- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేటలో ఉగాది ఉత్సవానికి హాజరైన మాజీ మంత్రి

సిద్దిపేట, మార్చి 30 : విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభం కలగాలని ఆ భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని బ్రాహ్మణ పరిషత్‌లో జరిగిన ఉగాది ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత రోజుల్లో పంచాంగ శ్రవణానికి చాలా ప్రాధాన్యం ఉండేదని, రానురాను పత్రికలతో పాటు పంచాంగం వచ్చేస్తుందని, రాశిఫలాల ఆధారంగా చదువుకోవడం అలవాటైందన్నారు. గతంలో ప్రజలు ఆసక్తిగా చూసేవారని, ఇప్పుడు ఫోన్‌లోనే చూసుకోవడం అలవాటై పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం తగ్గిందన్నారు. ఆచార సంప్రదాయాలు ముందుతరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. నరసింహశర్మగారు గేయ రామాయణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారని, వారు కోరిన విధంగా ఆధ్యాత్మికంగా సిద్దిపేటలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మిమ్ముల్ని చాలా గౌరవంగా సత్కరించి సన్మానించుకుంటామన్నారు. కేసీఆర్ గురించి అందరూ చెప్పారని.. నిజంగా చెప్పాలంటే వారు బ్రాహ్మణ బంధువు అన్నారు. దేశంలో మొట్టమొదటిసారి బ్రాహ్మణ పరిషత్‌ను సిద్దిపేటలో ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా దేశంలోనే మొట్టమొదటిసారి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆలయాల్లోని హుండీల్లో డబ్బులు వస్తేనే పూజారులకు జీతం వచ్చే పరిస్థితి ఉండేదని, అలాంటి పరిస్థితి నుంచి కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతినెలా మొదటి తేదీ దేవాలయ ఉద్యోగులకు జీతాలు వచ్చేలా చేశారన్నారు. యాదాద్రి దేవాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. ఈసారి అధికారంలోకి వచ్చిఉంటే కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేవారన్నారు. సిద్దిపేటలో బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని చక్కగా చేసుకున్నామని, వాస్తుకు ఇబ్బంది ఉందంటే మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు, ప్రభుత్వాలు చేయలేని పని దేవుడి పేరుమీద ఎంతో క్రమశిక్షణతో చేస్తామన్నారు. పిల్లల జీవితంలో మార్పు, చెడు అలవాట్లను దూరం చేయగలుగుతామన్నారు. పాతరోజుల్లో ఇంట్లో తిని సద్దికట్టుకుని బయటకు వెళ్లేవారు, ఇప్పుడు బయటతిని కావాల్సి వస్తే డబ్బా కట్టుకుని ఇంటికి వచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. గుణాత్మక మార్పు తేవాలంటే అది కేవలం ఆధ్యాత్మికత వల్లే సాధ్యమవుతుందన్నారు. పిల్లలు అభివృద్ధితో పోటీపడుతూ తెలుగు భాషను మర్చిపోతున్నారని, విదేశాల్లో ఉండే పిల్లలకు సంప్రదాయం,ఆచారాలు, పండుగలను చక్కగా నేర్పిస్తున్నారన్నారు. ఇక్కడ మనం మన సంప్రదాయాన్ని, భాషను మర్చిపోతున్నామన్నారు. విదేశాల్లో ఉండే మన తెలుగువారు బతుకమ్మ ఆడి బోనాలు తీస్తున్నారన్నారు. సిద్దిపేటలో టీటీడీ ఆధ్వర్యంలో మరో వేంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన చేయనున్నామన్నారు. పెద్ద జీయర్‌స్వామి చేతుల మీదుగా వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ప్రారంభించుకున్నామని చినజీయర్ స్వామి చేతుల మీదుగా స్వర్ణోత్సవం జరుపుకుందామన్నారు. చక్కగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సిద్దిపేట బ్రాహ్మణ పరిషత్‌కు ఆయన కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దిపేట మట్టి గొప్పదని, ఇక్కడి సాంస్కృతిక సాహిత్య వాతావరణ ప్రేరణతో ఇంతగొప్పవాడిని అయ్యానన్నారు. ఇక్కడి వాతావరణంలోనే సాంస్కృతిక సాహిత్య పరిమళాలు విరాజిల్లాయన్నారు. బ్రాహ్మణ పరిషత్ అభివృద్ధికి ఎమ్మెల్సీగా తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, కేసీఆర్ గురువు వేలేటి మృత్యుంజయశర్మ, అడ్వకేట్ మంగు హరిహరరావు, వితలశ్రీకాంత్‌శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కలకుంట్ల రంగాచారి, కవులు, పురోహితులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సిద్దిపేట బ్రాహ్మణ పరిషత్‌లో పంచాంగ శ్రవణం వింటున్న ప్రజలు

# మంచుకొండల్లో సిద్దిపేట అన్న ప్రసాదం



సిద్దిపేట: కేదార్‌నాథ్ అన్నదాన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

- కేదార్‌నాథ్ యాత్రికులకు అన్నదానం చేయడం అభినందనీయం
- కరపత్రం ఆవిష్కరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట,మార్చి 30 : అన్ని దానాల కన్నా గొప్పది అన్నదానం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట కేదార్‌నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో కేదార్‌నాథ్‌లో భక్తులకు మే2వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అన్నదానం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట అంటే సేవా కార్యక్రమాలను అందిపుచ్చుకున్న ప్రాంతం అని, కేదార్‌నాథ్‌యాత్రకు వెళ్లే భక్తులకు అక్కడ భోజనం పెట్టే అదృష్టం కేదార్‌నాథ్ సేవా సమితికి కలిగిందన్నారు. అమర్‌నాథ్ వెళ్లే యాత్రికులకు, ఇప్పుడు కేదార్‌నాథ్ వెళ్లే భక్తులకు ఇలాంటి సౌకర్యం అంత దూరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాంటి క్షేత్రాల్లో భక్తులకు సేవచేయడం అంటే భగవంతుడికి సేవ చేయడం అన్నారు. మానవ సేవయే.. మాధవ సేవ అని భావించి అమర్‌నాథ్ సేవా సమితి, కేదార్‌నాథ్ సేవా సమితి సభ్యులు సామాజిక, ఆధ్యాత్మిక సేవలో భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. మే2వ తేదీన కేదార్‌నాథ్‌లో సిద్దిపేట అన్నప్రసాదం అందుబాటులో ఉంటుందన్నారు. ఏప్రిల్ 25వ తేదీన శరబేశ్వర ఆలయం నుంచి కేదార్‌నాథ్‌కు ఆహార పదార్థాల వాహనం ప్రారంభమవుతుందన్నారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మిషన్ ఇలాకాలో నీటి గోస..!



సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం లకుడారంలో బోరు వద్దనీళ్లు పట్టుకుంటున్న మహిళలు

- కోమటిబండలో పురుడుపోసుకున్న 'మిషన్ భగీరథ'
- మిషన్ భగీరథ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- గజ్వేల్ నియోజకవర్గంలో తీవ్ర నీటిఎద్దడి
- నీటి సరఫరాలో కోత.. జనం ఇబ్బందులు
- జీపీల్లో నిధుల లేమీతో నోచుకోని బోర్ల మరమ్మతులు

> దేశానికే ఆదర్శంగా నిలిచిన 'మిషన్ భగీరథ' పథకం పురుడుపోసుకున్న గజ్వేల్ నియోజకవర్గంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సరిపడా నీరురాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని ఇంటింటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎన్నడూ వేసవికాలంలోనూ కనిపించని తాగునీటి కష్టాలు ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఇక్కడ మొదలయ్యాయి.

గజ్వేల్, మార్చి 30: ముందుచూపుతో కేసీఆర్ మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు నిర్మించి సిద్దిపేట జిల్లాలో సాగు,తాగునీటికి భరోసా కల్పించారు. ఈ రిజర్వాయర్ల నుంచి మిషన్ భగీరథ గ్రిడ్‌కు నీళ్లను తెచ్చి శుద్ధిచేసిన తర్వాత గ్రామాల్లోని ట్యాంకులకు, అక్కడి నుంచి ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, ములుగు, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో 178 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మార్చి ప్రారంభం నుంచే తాగునీటి సమస్యలు మొదలయ్యాయి. గతంలో మాదిరిగా మిషన్ భగీరథ నుంచి సరిపడా నీళ్లు నల్లాల ద్వారా వదలక పోవడంతో ప్రజలకు నీళ్లు సరిపోవడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో సరిపడా నీటిని సరఫరా చేసేవారు. దీంతో గ్రామాల్లోని బోర్లను వినియోగించే అవసరం లేకుండా పోయింది. దీంతో వాటి వినియోగంలేక అవి పనిచేయకుండా పోయాయి. వాటిని వినియోగంలోకి తీసుకురావాలంటే నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు రిపేర్ చేయించలేక పోతున్నారు. అధికారులు తాగునీటి సమస్యను గట్టెక్కించకపోతే రాబోయే ఏప్రిల్, మే నెలల్లో తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండలో మిషన్ భగీరథ సంపు

### నీటి సరఫరాలో అధికారుల విఫలం...

కుకునూర్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి రోజూ నల్లాల ద్వారా వచ్చే మిషన్ భగీరథ నీళ్లు సరిపోక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లకుడారం సమీపంలోని బోరు వద్ద గ్రామస్తులు నీళ్లు తెచ్చుకుంటున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ 3,4,15, 16 వార్డుల్లో తాగునీరు రావడం లేదని గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్‌కు నర్సయ్యకు ఇటీవల వినతి పత్రం అందజేశారు. కొద్ది రోజులుగా 11వ వార్డులో తాగునీళ్లు రావడం లేదంటూ కాలనీ వాసులు తెలుపుతున్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు మిషన్ భగీరథ నీళ్లు సరిపడా రాక పోవడంతో బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాగునీటి ట్యాంకు నిర్మాణంలో ఉంది. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. గజ్వేల్ మండలం కోమటిబండ మిషన్ భగీరథ సంప్ నుంచి ప్రతిరోజూ నియోజకవర్గంలోని గ్రామాలకు ఇక్కడి నుంచే శుద్ధిచేసిన నీటిని పంపిణీ చేస్తారు. ఇక్కడే ఈ పథకాన్ని బీఆర్‌ఎస్ హయాంలో ప్రారంభించారు. కుకునూర్‌పల్లి మండలం మంగోల్ గ్రిడ్ వద్ద శుద్ధిచేసిన తరువాత నీటిని ఆయా మండలాలకు పంపిణీ చేస్తారు. గజ్వేల్‌లోనే మిషన్ భగీరథ పథకం పురుడుపోసుకొని ఇతర జిల్లాలకు నీటిని పంపిణీ చేస్తుండగా, గజ్వేల్ ప్రజల దాహార్తి మాత్రం అధికారులు తీర్చడంలో విఫలమత్నురనే విమర్శలు వినిపిస్తున్నాయి.



గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ట్యాంకు

# కాళేశ్వరం నీళ్లతో కరువు దూరం



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**

చిన్నకోడూరు,మార్చి 30: కాళేశ్వరం నీళ్లతో కరువు దూరమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మైలారం కొండెంగులగుంటలో పెద్దమ్మ దేవాలయ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగిలో లక్ష ఎకరాలకు సాగు నీరు ఇచ్చామంటే కాళేశ్వరం పుణ్యమేనన్నారు. పెద్దమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని,పాడి పంటలు పండి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, మాజీ ఎంపీపీ కీసరి పాపయ్య, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పండుగకు దూరమై.. ఆందోళనకు సిద్ధమై..

**డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో రిలే నిరాహారదీక్ష**

గుమ్మడిదల,మార్చి 30: రాష్ట్ర ప్రజలంతా ఉగాది పండుగను జరుపుకొంటుంటే ఇక్కడి గ్రామాల ప్రజలు డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని రిలే నిరాహారదీక్ష చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో రాంకీ సంస్థ నిర్మిస్తున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల ప్రజలు 54వ రోజు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 54 రోజులుగా డంపింగ్‌యార్డు రద్దు చేయాలని దీక్షలు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్ర పాలకులు, జిల్లా యంత్రాంగం స్పందించక పోవడం విచారకరమన్నారు. పండుగకు దూరమై ఆందోళనకు దగ్గరై ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిలే నిరాహారదీక్షలో జేఏసీ నాయకులు, మహిళలు, గ్రామస్తులు మాట్లాడారు. డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, కొరివి సురేశ్, రాజుగౌడ్, మహిళా జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.




గుమ్మడిదల: నల్లవల్లిలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు, మహిళలు

# అంబలికేంద్రం ఏర్పాటు హర్షణీయం

**నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

కల్హేర్, మార్చి 30: బాటసారుల దాహార్తి తీర్చేందుకు అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో కల్హేర్ మాజీ సర్పంచ్ కుమ్మరి సాయిలు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్హేర్ మండల కేంద్రం కావడంతో వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు వస్తుంటారన్నారు. వారి దాహార్తిని తీర్చడంతో పాటు విటమిన్స్‌గల అంబలి కేంద్రం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ అధ్యక్షుడు నారాయణరావు, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ సంగప్ప, నాయకులు బాలయ్య, శ్రీనివాస్ గౌడ్, నర్సింహగౌడ్ హన్మంత్‌రావు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# గ్రూప్-1 ర్యాంకుల్లో మెరిసిన యువకులు

**మెదక్ జిల్లా యువకుడికి 41వ ర్యాంక్, సిద్దిపేట జిల్లా యువకుడికి 75వ ర్యాంకు**



శైలేశ్ ర్యాంక్ 41



ప్రభాత్‌రెడ్డి ర్యాంక్ 73



నర్రా అఖిల్ ర్యాంక్ 75

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 30: టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో మెదక్‌కు చెందిన శైలేశ్ రాష్ట్రస్థాయిలో 900 మార్కులకు 503 (41వ ర్యాంక్) సాధించాడు. శైలేశ్ విద్యాభ్యాసం నర్సరీ నుంచి 7వరకు మెదక్, 8 నుంచి పదో తరగతి వరకు తూప్రాన్‌లోని అభ్యాస ఇంటర్నేషనల్ స్కూల్, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లోని నారాయణ ఐఏఎస్ అకాడమీ, డిగ్రీ ఢిల్లీ యూనివర్సిటీలో కొనసాగింది. శైలేశ్ తండ్రి పూన రవి మెదక్‌లో నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల ర్యాంకులు ప్రకటించగా శైలేశ్ 41వ ర్యాంక్ సాధించాడు.

### మెరిసిన అఖిల్

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 30 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 ఫలితాల్లో సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని బందారం గ్రామానికి చెందిన నర్రా వజ్రమ్మ-భగవాన్‌రెడ్డి దంపతుల కుమారుడు నర్రా అఖిల్ రాష్ట్రస్థాయిలో 900 మార్కులకు 491.5 (75వ ర్యాంక్) సాధించాడు. టీజీపీఎస్సీ గ్రూప్-1 ర్యాంక్‌లు ప్రకటించగా నర్రా అఖిల్ రాష్ట్రస్థాయిలో 75వ ర్యాంక్ సాధించాడు. 75వ ర్యాంకు సాధించిన అఖిల్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

### ప్రతిభ చాటిన మూసాపేట విద్యార్థి

పెద్దశంకరంపేట, మార్చి 30: టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో పెద్దశంకరంపేట మండలం మూసాపేట గ్రామానికి చెందిన ఎరగారి ప్రభాత్‌రెడ్డి అనే యువకుడు రాష్ట్ర స్థాయిలో 73వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన శశింధర్‌రెడ్డి పావనీ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు ప్రభాత్‌రెడ్డి రెండు నెలల క్రితం వెల్లడైన గ్రూప్ -4 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రస్తుతం మెదక్ జిల్లా కొల్చారంలోని రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈసందర్భంగా అతన్ని గ్రామస్తులు, కుటుంబసభ్యులు, బంధువులు అభినందించారు.

# ప్రజలు సుఖసంతోషాలతో గడపాలి

**బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్**

హుస్నాబాద్‌టౌన్, మార్చి 30: విశ్వావసునామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో గడపాలని బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, శివాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉగాది పర్వదినం నుంచి అందరూ సంతోషంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు లేకుండా తెలంగాణ ప్రజాపాలనలో ప్రజలందరికీ లాభం జరిగేలా చూడాలని కోరుకున్నట్లు మంత్రి చెప్పారు. అనంతరం బ్రాహ్మణులు హుస్నాబాద్‌కు చెందిన ఆదాయం బాగుంటుందని, ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని వివరించారు. ఈ ఏడాది హుస్నాబాద్ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టీస్టాల్ యజమానులకు స్టీల్‌గ్లాసులను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు, ప్లాస్టిక్‌ను నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు కృషిచేయాలని ఆయన కోరారు. అంతకు ముందు ఎల్లమ్మచెరువు కట్టపై వాకింగ్‌చేసి వాకర్స్‌తో ముచ్చటించారు. సిద్దిపేట జిల్లాగ్రంథాలయ సంస్థచైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, మాజీవైస్‌చైర్ పర్సన్ అయిలేని అనిత, మాజీప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### ఫ్లెక్సీలో ఫొటోపై వివాదం

స్థానిక శివాలయం వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫొటోను పెట్టకపోవడంపై కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌ను బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రిగా ఉన్న సంజయ్ ఫొటోను ఫ్లెక్సీలో పెట్టకుండా వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామని కమిషనర్ చెప్పారు. అనంతరం మరో ఫ్లెక్సీని ఏర్పాటుచేయడంతో వివాదం సద్దుమణిగింది.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్